క్లుప్తంగా

కడప క్రికెట్ స్టేడియం కమిటీ అధ్యక్షుడిగా కేజీ గోవింద్‌రెడ్డి



కర్నూలు (టౌన్): కడప జిల్లా క్రికెట్ స్టేడియం కమిటీ అధ్యక్షుడిగా కేజీ గోవింద్ రెడ్డి నియమితులయ్యారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా 15 సంవత్సరాలుగా ఆయన స్థానికంగా క్రికెట్ అభివృద్ధికి చేసిన సేవలకు గాను ఆంధ్ర క్రికెట్ సంఘం ఆయనను కడప జిల్లా క్రికెట్ స్టేడియం కమిటీ అధ్యక్షుడిగా నియమించినట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి కె. దేవేంద్ర గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అవకాశం కల్పించిన ఆంధ్ర క్రికెట్ సంఘం అధ్యక్షులకు, కార్యదర్శులకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రాజకీయ కేంద్రాలుగా విద్యాలయాలు

కర్నూలు సిటీ: ప్రభుత్వ పాఠశాలల్లో కమిటీల చైర్మన్లు రావడం వలన విద్యా కేంద్రాలు రాజకీయ కేంద్రాలుగా మారుతాయని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి గట్టు తిమ్మప్ప సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పాఠశాలలకు కమిటీలు ఉన్నాయని, భవిష్యత్తులో స్కూల్ కాంప్లెక్స్‌లకు సైతం కమిటీలు వస్తాయన్నారు. కాంప్లెక్స్ పాఠశాలల పరిధిలోకి కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు చేరి, ఆ స్కూళ్ల టీచర్లను అకడమిక్ సలహాదారులుగా నియమిస్తారన్నారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులుగా గ్రేడ్–1 హెచ్‌ఎంలను నియమించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానం–2020 అమలులో భాగంగా పాఠశాల కాంప్లెక్స్ బలోపేతం పేరిట మండల విద్యాధికారాలను కత్తిరించి, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు ఆ క్లస్టర్ పరిధిలోని ఎస్‌జీటీలను ట్యాగ్ చేయడానికిడీటీఎఫ్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.

విశ్వకర్మ జయంతిని విజయవంతంచేయండి

కర్నూలు(అర్బన్): దేవతల శిల్పిగా పూజలు అందుకునే విశ్వకర్మ జయంతిని నేడు (17వ తేదీన) ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఘనంగా నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ విశ్వ కర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు దేవపూజ ధనుంజయ ఆచారి తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రపంచంలోనే తొలి ఇంజినీరుగా గుర్తింపు పొందిన విశ్వకర్మ జయంతి సందర్భంగా పలు కార్యాలయాలు, కర్మాగారాల్లో పనిముట్లను పూజల్లో ఉంచి భక్తి తో పూజలు నిర్వహిస్తారన్నారు. నగరంలో పాతబస్టాండ్ చెన్నకేశవ స్వామి దేవాలయం, ఉల్చాల రోడ్డులోని గాయత్రీ వీరభద్ర దేవాలయం, కల్లూరు కాళికాదేవి దేవాలయం, ఎస్టేట్‌లోని సాయిబాబా దేవాలయంలో విశ్వకర్మ పూజలు నిర్వహిస్తారని, ఇందులో విశ్వబ్రాహ్మణులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతంచేయాలని కోరారు.

ఎంఈఓ–2 పోస్టుల రద్దు ఆలోచనను విరమించుకోవాలి

కర్నూలు సిటీ: మండల విద్యాధికారి–2 పోస్టులను రద్దు చేసి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులకు అధికారాలు బదలాయించాలని ప్రభుత్వం చేస్తున్న ఆలోచనను విరమించుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వి కృష్ణారెడ్డి, రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయులకు ఇప్పటికే పాఠశాల విధులతోనే సతమతమవుతున్నారని, వారికి మండల పరిషత్ పాఠశాలల అధికారాలను కల్పిస్తే రెండింటికి న్యాయం చేయలేరని అన్నారు. దీని వలన విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందన్నారు. విద్యాశాఖలో దాదాపు 95 శాతం ఉన్న పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలనే లక్ష్యంతో ఎంఈఓ–2 వ్యవస్థ ఏర్పడిందన్నారు. దీనిని ఇప్పుడు రద్దు చేస్తే వారికి తీరని అన్యాయం జరుగుతుందన్నారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి డ్రైవర్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన కృష్ణ

కర్నూలు: గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్‌పై విగ్రహాన్ని తరలిస్తుండగా ప్రమాదవశాత్తు డ్రైవర్ కింద పడి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పాతబస్తీ బండిమెట్టలోని అలిసేర్ భాగ్ వీధికి చెందిన గద్ద పోగు కృష్ణ (49) ఆటో తోలుతూ జీవనం సాగించేవాడు. ఆదివారం రాత్రి పూలబజార్ ఆటో స్టాండ్ దగ్గర ఉన్న విగ్రహాన్ని నిమజ్జనం నిమిత్తం కేసీ కెనాల్ ఘాట్ వద్దకు తరలిస్తుండగా కొండారెడ్డి బురుజు దగ్గర ప్రమదవశాత్తు ట్రాక్టర్ టైర్ కిందపడి రక్తగాయాల పాలయ్యాడు. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య అంజలి, ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ మన్సూర్ తెలిపారు.

వీబీఆర్‌కు నీటి విడుదల

వెలుగోడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింకు చానల్ ద్వారా వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లోకి 9,200 క్యూసెక్కుల కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నట్లు తెలుగుగంగ ప్రాజెక్టు ఏఈ శివ నాయక్ తెలిపారు. ప్రాజెక్టులో అంతర్భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి గాలేరు నదికి 6,000 క్యూసెక్కులు, మద్రాస్ కాలువకు 5,000, వన్ ఆర్ తూముకు 50 , వన్ ఎల్ తూముకు 30 క్యూసెక్కులు నీటిని పంపుతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం వీబీఆర్‌లో సోమవారం 14.445 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ వివరించారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ

మహమ్మద్ ప్రవక్త పుట్టిన రోజును పురస్కరించుకుని మిలాద్ ఉన్ నబీ వేడుకలు నగరంలో ఘనంగా జరిగాయి. మిలాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం లతీఫ్ లావుబాలీ దర్గా నుంచి రాజ్ విహార్ సెంటర్ వరకు భారీ జులూస్ నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ముస్లిం మత పెద్దలు, వివిధ దర్గాల పీఠాధిపతులు ప్రసగించారు. ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



రాజ్ విహార్‌లో మిలాద్ ఉన్ నబీ సభకు భారీ సంఖ్యలో హాజరైన ముస్లింలు



మాట్లాడుతున్న మేయర్ బీవై రామయ్య



మిఠాయిలు పంపిణీ చేసుకుంటున్న ముస్లింలు




మిలాద్ పాటలు ఆలపిస్తున్న దృశ్యం

నేడు మహా గణనాథునికి వీడ్కోలు

- పెద్దమార్కెట్ సమీపంలో 63 అడుగుల మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు
- ప్రతిష్టించిన చోటే నిమజ్జనానికి భక్త బృందం ఏర్పాట్లు

కర్నూలు కల్చరల్: నగరంలోని పెద్ద మార్కెట్ సమీపంలో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన 63 అడుగుల భారీ మట్టి గణనాథునికి నేడు నిమజ్జనం చేయనున్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ విగ్రహానికి 10 రోజుల పాటు భక్తులు విశేష పూజలు చేశారు. పదకొండవ రోజు మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రతిష్టించిన చోటే నిమజ్జనం చేయనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. పర్యావరణ హితానికి ప్రతీకగా నిలిచేలా ఏర్పాటు చేసిన ఈ గణనాథునికి ముందుగా పాలు, పసుపు, కుంకుమలతో అభిషేకం చేస్తారు. తర్వాత తుంగభద్ర నది నీటితో ఫైరింజన్ల ద్వారా నిమజ్జనం చేయనున్నట్లు సమితి ప్రతినిధి కల్యాణ్‌కుమార్ పేర్కొన్నారు. భక్తులు ఈ వేడుకలో పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.



నిమజ్జనోత్సవానికి సిద్ధమైన ఎకో ఫ్రెండ్లీ మహా కాయుడు



అన్నదానం చేస్తున్న మేయర్ బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి

మట్టి విగ్రహం ఏర్పాటు అభినందనీయం

కర్నూలులో పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు అభినందనీయమని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. తుంగ భద్ర నది తీరంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ మట్టి వినాయక విగ్రహం వద్ద సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మేయర్ రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పూజల్లో పాల్గొని అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎకో ఫ్రెండ్లీ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తూ దేశంలో ఆదర్శంగా కర్నూలు యువత నిలవడం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కేవీ సుబ్బారెడ్డి, భక్త బృందం వ్యవస్థాపకులు కల్యాణ్ కుమార్, సభ్యులు అశోక్, భరత్, సతీష్, ఆనంద్, చింటు, మహేష్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

ముగిసిన గణపతి నవరాత్రోత్సవాలు

- మృత్తికా గణపతికి నిమజ్జనం



గణపతి నవరాత్రోత్సవాలకు పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: వినాయక చవితిని పురస్కరించుకుని శ్రీశైలంలో ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన గణపతి నవరాత్రోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో భాగంగా అర్చకులు స్వామివారి యాగశాలలో పూర్ణాహుతి జరిపించారు. ముందుగా ఆలయంలోని రత్నగర్భ గణపతి స్వామికి, అలాగే సాక్షిగణపతి స్వామి, మృత్తికా గణపతి వారికి ప్రత్యేక పూజలు జరిపించారు. యాగశాలలో నెలకొలిపిన పంచలోహ వరసిద్ధి వినాయక స్వామికి కూడా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం లోక కల్యాణం కోసం జపాలు, నిత్యహోమ బలిహరణలను చేసి గణపతి హోమం, జయాదిహోమం జరిపించారు. తరువాత పూర్ణాహుతి, వసంతోత్సవం, అవభృథం కార్యక్రమాలు చేపట్టారు. పూర్ణాహుతి కార్యక్రమంలో శాస్త్రోక్తంగా నారికేళాలు పలు సుగంధద్రవ్యాలు మొదలైన ద్రవ్యాలను హోమ గుండంలోకి ఆహుతిగా సమర్పించారు. అనంతరం జరిగిన అవబృథంలో వరసిద్ధి వినాయకస్వామి పంచలోహమూర్తికి ఆలయ ప్రాంగణంలోని మల్లికాగుండంలో వైదిక శాస్త్రోక్తంగా స్నపన కార్యక్రమం నిర్వహించారు. గణపతి నవరాత్రోత్సవాల సందర్భంగా సాక్షి గణపతి ఆలయంలో నెలకొల్పిన మృత్తికా గణపతి విగ్రహాన్ని సోమవారం లింగాలగట్టు వద్ద పాతాళగంగలో నిమజ్జనం చేశారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

కల్లూరు: క్రీస్తు మార్గం అనుసరణీయమని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి అన్నారు. సోమవారం రాత్రి కల్లూరు అర్బన్ 41వ వార్డులోని ఎబెనేజరు బాప్టిస్ట్ చర్చి 17వ వార్షికోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పార్వతమ్మ, గంగాధర్ గౌడ్, చర్చి సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి

కల్లూరు: కార్మిక, కష్టజీవుల ఆశాజ్యోతి సీతారాం ఏచూరి అని సీఐటీయూ నాయకులు సుధాకరప్ప, రామాంజనేయులు, యేసు అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో భవన నిర్మాణ కార్మిక సంఘం నగర కమిటీ ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి సంతాప సభ నిర్వహించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనతరం సీతారాం ఏచూరికి రెడ్ సెల్యూట్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకట్రాముడు, శ్రీను, అయ్యన్న, శ్రీనివాసులు, దాసు పాల్గొన్నారు.

నాడు అభివృద్ధి పథం.. నేడు విధ్వంస పర్వం

- పెట్రేగిపోతున్న టీడీపీ నాయకులు
- యథేచ్ఛగా ఆక్రమణలు, విధ్వంసాలు
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

డోన్: మూడు నెలల కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల దురాగతాలు హద్దులు దాటుతున్నాయి. ఎన్నికల్లో ఎన్నో హామీలిచ్చిన నేతలు అన్నింటినీ విస్మరించారు. కింది స్థాయి నేతలు యథేచ్ఛగా ఆక్రమణలు, అక్రమాలు, కమీషన్లు పరమావధిగా బరితెగిస్తున్నారు. ప్రజలను భయపెట్టేలా విధ్వంసాలు, దాడులకు తెగబడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిన డోన్ నియోజకవర్గంలో ప్రస్తుతం విధ్వంస పర్వం కొనసాగుతోంది. ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గానికి రూ.3,500 కోట్లు వెచ్చించి విద్య, వైద్య, ఉపాధి రంగాలలో అభివృద్ధిని పరుగులు పెట్టించారు. తాగు, సాగు నీటి సమస్య పరిష్కారానికి ఎంతో చొరవ చూపారు. 2024 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అభివృద్ధిని కొనసాగించాల్సింది పోయి విధ్వంసానికి తెగబడింది. ఒకవైపు ప్రజాధనంతో నిర్మించిన కట్టడాలను ధ్వంసం చేస్తూనే మరోవైపు గ్రామాల్లో రేషన్ షాప్ డీలర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, బుక్ కీపర్లు, వీఏఓ పోస్టులకు రాజీనామాలు చేయాలని పలువురిని వేధించారు. ఆధిపత్యం కోసం ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రశాంతంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో కక్షల కుంపటిని రగిల్చేందుకు కుట్ర పన్నుతున్నారు. ఇటీవల డోన్‌లో జరిగిన ఘటనలు టీడీపీ నేతల ఆగడాలకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



పార్కు స్థలం ఆక్రమణ

పట్టణ శివారులోని ఎన్‌కే, సాక్షి టౌన్‌షిప్‌ల మధ్యలో పార్కు స్థలాన్ని అధికార పార్టీ నాయకులు ఆక్రమించి కొంత భాగాన్ని ప్లాట్లు వేసి విక్రయించారు. వంద అడుగుల రోడ్డు మధ్యలో ప్రహరీని నిర్మించి కుడా నిబంధనలను తుంగలోకి తొక్కారు. సువిశాలమైన రోడ్లు, పార్కులు ఉంటాయని భావించి ఈ రెండు వెంచర్లలో ప్లాట్లు కొన్న వారికి వెంచర్ల నిర్వాహకుల తీరు ఆగ్రహాన్ని కలిగించింది.

ఆర్‌అండ్‌బీ రోడ్డునే తవ్వేశారు



ప్రభుత్వం మాది.. మమ్మల్ని ఎవరూ అడిగేది అనే తరహాలో టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారనేందుకు ఇటీవల మండల కేంద్రంలో ప్యాపిలిలో జరిగిన ఘటనే నిదర్శనం. పట్టణ సమీపంలో టీడీపీ నాయకుడు నిర్వహిస్తున్న ఫంక్షన్ హాల్‌కు పైప్‌లైన్ వేసుకునేందుకు ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న కొత్తగా వేసిన రోడ్డును యథేచ్ఛగా తవ్వించాడు. స్థానికుల ఫిర్యాదుతో ఆర్‌అండ్‌బీ అధికారులు అక్కడికి చేరుకుని తవ్విన గుంతను పూడ్చివేయించారు.



అడ్డొచ్చిందని డివైడర్‌ను తొలగించారు

ప్యాపిలి పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు తన వెంచర్‌కు ఎదురుగా ఉన్న డివైడర్ కారణంగా వెంచర్‌లో ప్లాట్లకు డిమాండ్ లేదన్న సాకుతో రాత్రికి రాత్రే డివైడర్‌ను ధ్వంసం చేశాడు. ఎవరైన చేసి ఉంటే ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకునేవారు. వెంచర్ నిర్వాహకుడు టీడీపీ నేత కావడంతో అధికారులకు పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి చేతులు దులుపుకున్నారు.

రెండు దారులున్నా..

డోన్ పట్టణం తారకరామనగర్‌లో నిర్మించిన రోటరీ క్లబ్ పార్కు ఫెన్సింగ్‌ను మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా తొలగించి టీడీపీ కార్యాలయానికి రహదారిని ఏర్పాటు చేసుకోవడం పట్ల కూడా ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం టీడీపీ కార్యాలయానికి రెండు రోడ్లు ఉన్నా కూడా మూడవ రోడ్డు కోసం ప్రజాధనంతో నిర్మించిన పార్కు ఫెన్సింగ్‌ను తొలగించడం ఎంతవరకు సమంజసమని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



మంత్రి గారు చెప్పారని!



ఉస్మానియా కళాశాల సమీపంలోని టీజీ మైనార్టీ షాదీఖానా

- హడావుడిగా టీజీ షాదిఖానాకు నూతన కమిటీ ఎన్నిక
- స్థానిక కార్పొరేటర్‌ను తప్పించి.. కౌన్సిల్‌కు చెప్పకుండా నిర్ణయం
- ఉత్తర్వులు జారీ చేసిన నగరపాలక అధికారులు



గత కమిటీలో కార్పొరేటర్‌కు చోటు కల్పిస్తూ జారీ అయిన ఉత్తర్వులు



తాజా కమిటీలో కార్పొరేటర్ పేరు లేకుండా జారీ అయిన ఉత్తర్వులు

కర్నూలు (టౌన్): పట్టుమని పదిమంది కార్పొరేటర్లు కూడా లేకపోయినా నగరపాలక సంస్థపై పెత్తనం చెలాయించేందుకు తెలుగుదేశం పార్టీ నేతలు ఉవ్విళ్లురుతున్నారు. రాష్ట్రంలో తమ పార్టీ అధికారం ఉండటంతో ఇక అంతా తమ ఇష్టమన్నట్లు వ్యవహరిస్తున్నారు. వీరికి అనుకూలంగా నగరపాలక అధికారులు సైతం తల ఊపుతున్నారు. మంత్రి గారు చెప్పిందే తడవు అన్నట్టు టీజీ షాదీఖానాకు నూతన కమిటీని నియమించారు. కనీసం స్థానిక కార్పొరేటర్‌కు చెప్పకుండా, కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లకుండా చకచకా నియామక ఉత్తర్వులు జారీ చేశారు. అంతేకాదు షాదీఖానా భవనంపై పసుపు జెండాలు సైతం ఏర్పాటు చేయడం విడ్డూరంగా ఉంది. వివరాల్లోకి వస్తే.. ఉస్మానియా కళాశాల సమీపంలోని టీజీ మైనార్టీ షాదీఖానా ఉంది. 2010 సంవత్సరంలో అప్పటి కార్పొరేటర్ అబ్దుల్ సలాం 5 వ వార్డు కార్పొరేటర్‌గా, స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. అప్పట్లో 5 వ వార్డు పరిధిలోని అదే ఏరియా పునర్విభజనలో 10వ వార్డు అయ్యింది. ఈ వార్డుకు ప్రస్తుతం అబ్దుల్ సలాం కుమారుడు షేక్ యూనూసు బాషా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. పాలకవర్గం గడువు ఉంది. ఆయనను కాదని, కనీసం కమిటీలో చోటు లేకుండా నగర పాలక అధికారులు నిర్ణయం తీసుకున్నారు. గతంలో కమిటీలో కమిషనర్, ఆరోగ్యశాఖ అధికారి, మున్సిపల్ ఇంజినీర్, స్థానిక కార్పొరేటర్ ఉన్నారు. ఇప్పుడు మంత్రి చెప్పిందే.. తడవుగా 8 మందిని తాజాగా కమిటీలో చోటు కల్పించారు. ఇందులో స్థానిక కార్పొరేటర్‌కు చోటు కల్పించకపోవడం విమర్శలకు తావిస్తోంది. షాదీఖానా నగరపాలక సంస్థ ఆస్తి అయినా పర్యవేక్షణ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ చేస్తుంది. షాదీఖానాకు నియమించిన కమిటీ లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆర్థిక లావాదేవీలు రికార్డు చేయడం, వాటిని నగరపాలకకు సమర్పించడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది.

కౌన్సిల్‌కు చెప్పకుండా...

ఏవైనా నిర్ణయాలు తీసుకోవాలంటే నగరపాలకకు పాలక వర్గం, స్టాండింగ్ కమిటీ ఉంది. షాదీఖానా కమిటీ నియమాకం గురించి కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి చర్చించాలి. అయితే, అధికారులు ఈ నిబంధనలు ఏవీ పట్టించుకోకుండా అధికార పార్టీ నుంచి ఫోన్ రావడమే తడవుగా ఆఘామేఘాల మీద నియామక ఉత్తర్వులు ఇచ్చేశారు. నూతన కమిటీలో మహమ్మద్ ఉల్ హక్, ఖలీమ్ అహమ్మద్, ఇమ్రాన్ బాషా, సీరాజ్ అలీ ఖాన్, షేక్ షాకీర్, సల్మాన్ ఖాన్, దనీష్ అలీ ఖాన్, షేక్ రేష్మా బీ లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. ఇదే విషయాన్ని 'సాక్షి' పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమకు తెలియదని సమాధానం చెప్పడం గమనార్హం. ఇదిలా ఉంటే ఎలాంటి సమాచారం లేకుండా నూతన కమిటీని నియమించడంపై స్థానిక కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వార్డు ప్రజలతో కలిసి ఆందోళనకు సిద్ధమవుతున్నారు.

కందనవోలు వరప్రదాయిని ఆరేపల్లి వరలక్ష్మమ్మ



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య సాయిగోపాల్, సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: కందనవోలు వరప్రదాయిని ఆరేపల్లి వరలక్ష్మమ్మ అని క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డి.వి.ఆర్.సాయిగోపాల్ అన్నారు. నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం పింగలి సూరన తెలుగు తోటలో ప్రముఖ కవయిత్రి ఆరేపల్లి వరలక్ష్మమ్మ రచించిన శ్రీమద్దేవీ భాగవతం–1,2, రాజశేఖర చరిత్ర, దశకుమార చరిత్రము, పారిజాతాపహరణం పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. క్లస్టర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య డి.వి.ఆర్.సాయిగోపాల్ సాహితీ వేత్తలు కురాడి చంద్రశేఖర కల్కూర, జేఎస్ఆర్కే శర్మ పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎనిమిదో తరగతి వరకే చదువుకొని దాదాపు పాతిక పుస్తకాలను వెలువరించిన ఘనత వరలక్ష్మమ్మకే దక్కుతుందన్నారు. కవులు, రచయితలు డాక్టర్ వీపూరి వెంకటేశ్వర్లు, గొరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, డాక్టర్ బోలుగద్దె అనిల్ కుమార్, డాక్టర్ తొగట సురేష్‌బాబు పుస్తకాలను సమీక్షించారు. అనంతరం కవయిత్రి వర లక్ష్మమ్మను ఘనంగా సన్మానించారు. నరసం అధ్యక్షురాలు డాక్టర్ దండెబోయిన పార్వతీ దేవి, సభ్యులు కర్నాటి చంద్రమౌళిని, హైమావతి, పసుపులేటి నీలిమ, రజనీ కల్కూర, లక్ష్మీ సుశీల రాణి, మణికంఠ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవలో భాగస్వాములవుదాం



పి.వి.రామలింగేశ్వర్, నగరపాలక కమిషనర్

కర్నూలు (టౌన్) : ఈనెల 17 నుంచి వచ్చే నెల 1 వ తేదీ వరకు నగరంలో నిర్వహించే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో అందరం భాగస్వాములవుదామని నగర పాలక కమిషనర్ రామలింగేశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం 7.30 గంటలకు నగరపాలక అధికారులు, సిబ్బంది, సచివాలయాల కార్యదర్శులతో కలిసి కలెక్టరేట్ నుంచి రాజ్‌విహార్ సెంటర్ వరకు ర్యాలీ, మానవహారం, ప్రతిజ్ఞ తదితర కార్యక్రమాలు చేయనున్నట్లు తెలిపారు. పరిశుభ్రమైన దేశం– సురక్షిత ప్రజారోగ్యం కోసం చేపట్టే ఈ ర్యాలీకి ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరవుతారని, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నేటి నుంచి అక్టోబర్ 1 వ తేదీ వరకు రోజుకొక కార్యక్రమం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతపై మానవహారాలు, స్వచ్ఛతా పరుగు, బహిరంగ స్థలాల్లో మొక్కలు నాటడం, సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పారిశుధ్యంపై అవగాహన, తాగునీటి వనరుల క్లోరినేషన్, ఉద్యానవనాలు, పర్యాటక కేంద్రాల సుందరీకరణ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. అక్టోబర్ 2 వ తేదీ నగరపాలక కౌన్సిల్ హాలులో స్వచ్ఛ భారత్ దివస్ కార్యక్రమం నిర్వహిస్తామని సోమవారం ఓ ప్రకటనలో కమిషనర్ వెల్లడించారు.

యువత రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న వారిని అభినందిస్తున్న కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని రాజవిహార్ సెంటర్‌లో ఉన్న ఓల్డ్ ఆర్‌టీసీ డిపోలో మిలాద్ సెంట్రల్ కమిటీ, లైఫ్ యువనేత్ర సేవా సమితి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు ప్రారంభించారు. శిబిరంలో 50 మంది యువకులు రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని నిర్వాహకులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మిలాదున్ నబీ పర్వదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబుప్రసాద్, టూటౌన్ సీఐ నాగరాజ రావు, సీఐ కేశవరెడ్డి, వన్‌టౌన్ సీఐ రామనాయుడు, త్రీటౌన్ సీఐ మురళీధర్‌రెడ్డి, పవన్‌కిశోర్, ఎస్ఐ బిందు మాధవి, మిలాద్ సెంట్రల్ కమిటీ సభ్యులు కన్వీనర్ ఎం. ఖదీరుల్లా, లైఫ్ కన్వీనర్ రవికుమార్, రిటైర్డ్ హెచ్‌ఎం యాగంటయ్య, చంద్రశేఖర్, అలా బజార్ లక్ష్మణస్వామి పాల్గొన్నారు.